## చెన్నారావుపేట ఎస్సై బదిలీ

చెన్నారావుపేట, డిసెంబర్ 13 : వరంగల్ జిల్లా చెన్నారావుపేట ఎస్సై మహేందర్‌పై బదిలీ వేటు పడింది. వీఆర్‌కు బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో బుధవారం కొందరు చెన్నారావుపేటలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మహేందర్ స్థానంలో శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇక్కడ పలు ఆరోపణలు ఎదుర్కొన్న ఎస్సై మహేందర్ ఆకస్మాత్తుగా బదిలీ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆయన ట్రైనింగ్ పీరియడ్ పూర్తికావడంతో మరో ట్రైనింగ్ ఎస్సైకి అవకాశం కల్పించడానికి మహేందర్ బదిలీ జరిగిందని పోలీసు అధికారులు చెబుతున్నారు. వివాదాలు, అవినీతి ఆరోపణలు ఎస్సై మహేందర్ బదిలీకి దారి తీశాయని లోకల్‌గా ప్రచారం జరుగుతోంది. మహేందర్ చెన్నారావుపేట ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే ఇక్కడి ఉప్పరపల్లి గ్రామ శివారులోని జీడిగడ్డతండాలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అనుమానితుడిగా భావించి ఎస్సై మహేందర్ ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ తర్వాత ఆ వ్యక్తికి హత్యతో సంబంధం లేదని తేలింది. దీంతో ఎస్సై మహేందర్ తనను అకారణంగా కొట్టారని, తాను అనారోగ్యం పాలైనట్లు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇదిలా ఉంటే రేషన్ బియ్యం, గుడుంబా బెల్లం వ్యాపారుల నుంచి మహేందర్ నెలనెలా ముడుపులు గుంజారని, ప్రతినెల పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సబ్సిడీ రుణాల మంజూరులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై కొద్దినెలల క్రితం చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన ఎంపీపీ విజేందర్, స్థానికుడు చెన్నారెడ్డిపై ఎస్సై మహేందర్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో విజేందర్, చెన్నారెడ్డిపై రౌడీషీట్ కూడా ఓపెనైంది. ఇదే సమయంలో ఎస్సై మహేందర్ అవినీతికి పాల్పడుతున్నారని పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. ఇటీవల ఎన్నికల ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘించారని నర్సంపేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో పాటు మరికొందరిపై పీఎస్‌లో కేసు నమోదైంది. ఎస్సై మహేందర్ ఉద్ధేశ్యపూర్వకంగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకొని ఈ కేసు నమోదు చేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్దిరోజులకే ఎస్సై మహేందర్ బదిలీ కావడం చర్చకు దారి తీస్తోంది.

# సైన్స్‌ఫేర్‌తో విజ్ఞానానికి పదును

- జిల్లా వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు
- విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం
- ప్రతిభ కనబరిస్తే రాష్ట్రస్థాయికి ఎంపిక



ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఫైల్)

గిర్మాజీపేట, డిసెంబర్ 12: బాలలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తుంది. తద్వారా విద్యార్థి దశలోనే వారి సృజనాత్మకతకు పదునుపెట్టేలా విజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సాహమందిస్తున్నది. ఈ నెలలో జిల్లాస్థాయి వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శన నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో విద్యార్థులు పాల్గొని వారి మెదడుకు పదును పెట్టనున్నారు. జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన ప్రయోగాలను (ఎగ్జిబిట్లు) రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు.

### మార్కులు ఇలా...

ఒక్కో ప్రదర్శనకు వంద మార్కులు కేటాయించారు. విద్యార్థి సొంతంగా తయారుచేసి ఊహించి రాస్తే 20 మార్కులు, సైన్స్, గణిత భావనలు స్పష్టంగా కనిపిస్తే 15 మార్కులు, సైంటిఫిక్(ప్రయోగ) సూత్రానికి 15 మార్కులు, ప్రయోగం తయారు చేసే విధానం కోసం 15 మార్కులు, సమాజానికి ఉపయోగపడేలా వినియోగించుకునేలా ఉంటే 15 మార్కులు, తక్కువ ఖర్చుతో లాభదాయకంగా ఉంటే 10 మార్కులు, ప్రయోగం వివరించే విధానానికి 10 మార్కులు కేటాయిస్తారు. గ్రామీణ, గిరిజన, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు 5 శాతం, పట్టణ పరిధిలోని విద్యార్థులకు 3 శాతం వెయిటేజీ కేటాయిస్తారు.

### ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించాల్సిన అంశాలు

1. ఆరోగ్యం, లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్), అగ్రికల్చర్, కమ్యూనికేషన్ అండ్ ట్రాన్స్‌పోర్ట్, కంప్యూటేషనల్ థింకింగ్

### వేర్వేరుగా ప్రదర్శనలు...

ఐదు ఉప అంశాలతో పాటు నూతన ఆవిష్కరణకు సంబంధించిన ఏవైనా ప్రయోగాలను ప్రదర్శించవచ్చు. 6 నుంచి 7వ తరగతి వరకు జూనియర్ విభాగంగా, 8 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ విభాగంగా పరిగణించనున్నారు. ఈ ప్రదర్శనలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వారు చేసిన ఎగ్జిబిట్లను ప్రదర్శించవచ్చు. అలాగే, విద్యార్థులతో పాటు సైన్స్, గణితం, అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు, డీఈడీ, బీఈడీ శిక్షణ పొందుతున్న వారు, బోధన ఉపకరణాలు అనే అంశంపై ప్రయోగాలను ప్రదర్శించడానికి అవకాశం కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా ప్రయోగాలు ప్రదర్శించడానికి అధికారులు ఏర్పాట్లు చేయడంలో సన్నద్ధమవుతున్నారు. స్వయంగా తయారు చేసిన వాటినే అనుమతిస్తారు. రెడిమేడ్ నమూనాలు అనుమతించబడవు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన ప్రయోగానికి ప్రాధాన్యం ఉంటుంది. ఇక విద్యార్థితో పాటు ఒక గైడ్ టీచర్ మాత్రమే ఒక ప్రాజెక్టు ప్రదర్శనలో పాల్గొనాలి. అలాగే, జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనతో పాటు ఇన్‌స్పైర్ ప్రదర్శనను కూడా నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో 121 మంది విద్యార్థులు పాల్గొననున్నారు.

### మేధా సంపత్తిని వెలికితీసేందుకే సైన్స్‌ఫేర్



విద్యార్థుల్లో మేధాసంపత్తిని వెలికితీసేందుకే సైన్స్ ఫేర్ దోహదపడుతుంది. ఈ ప్రదర్శనలో జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించాలి. అందుకు పాఠశాలల హెచ్‌ఎంలు కృషిచేయాలి. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిస్తే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ప్రతి పాఠశాలలోని విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి.

– జిల్లా విద్యాశాఖాధికారి డీ వాసంతి

# ఓటరు నమోదుకు మరో చాన్స్

### సవరణకు అవకాశం

హనుమకొండ, డిసెంబర్ 13: ఓటరుగా నమోదు చేసుకొనేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఎన్నికల సంఘం పార్లమెంట్, గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మరోసారి ఓటరు నమోదు, సవరణ, మార్పులు, చేర్పులు చేసేందుకు నిర్ణయించింది. ఇందుకుగాను వచ్చే ఏడాది 2024 జనవరి 1 తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకొనేందుకు వీలు కల్పించింది. రెండో శనివారం, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నది. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 2024 జనవరి 6న ఇంటిగ్రేటెడ్ ముసాయిదా ఓటరు జాబితాను వెల్లడించి, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను విడుదల చేసేందుకు ఎన్నికల సంఘం ఆదేశించింది. గత ఐదు రోజుల క్రితమే ఇందుకు సంబందించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఇటీవల రూపొందించిన ఓటరు జాబితా ప్రకారం హనుమకొండ జిల్లాలో 5,08,124 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బీఎల్‌వోలు, తహసీల్దార్ కార్యాలయల్లో దరఖాస్తు చేసుకుంటున్నారని అధికారులు తెలిపారు.

### జిల్లాలో పెరుగనున్న ఓటర్లు

ప్రస్తుతం ఎన్నికల సంఘం చేపట్టిన మధ్యంతర ఓటరు నమోదు, సవరణ, మార్పులు, చేర్పులు కార్యక్రమంతో జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. జాబితాలో పేర్లు లేని వారు, ఓటరు నమోదు చేసుకొనని వారు, మార్పులు, చేర్పులకు సంబంధించి దరఖాస్తు చేసుకొంటే జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

## యువతి ఆత్మహత్య

భీమదేవరపల్లి, డిసెంబరు 13: మండలంలోని ధర్మారంలో చెప్యాల హరిప్రియ(25) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తండ్రి ఆనందం కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మెహదీపట్నంలో ప్రీమియర్ కళాశాలలో రెండు సంవత్సరాలు నర్సింగ్ చేసింది. ఆరోగ్యం బాగా లేక ఆరునెలల క్రితం ఇంటికి వచ్చింది. ఐదు సంవత్సరాలుగా ఇదే గ్రామానికి చెందిన రాజేశ్, హరిప్రియ ప్రేమించుకుంటున్నారు. రాజేశ్ పెళ్లికి నిరాకరించడంతో హరిప్రియ మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకున్నది. తన కూతురు హరిప్రియ చావుకు కారణమైన రాజేశ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆనందం కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై నండ్రు సాయిబాబు తెలిపారు.


## బేటీ బచావో బేటీ పడావోపై సమీక్ష

హనుమకొండ, డిసెంబర్ 13 : హనుమకొండ కలెక్టరేట్‌లో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి మధురిమ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి గణేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లల సంరక్షణకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలను బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశాలు ప్రతి 3 నెలలకు ఒకసారి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ హై, డీపీఓ జగదీశ్, ఎఫ్‌ఎంఎం సంస్థ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- దివ్యాంగుల క్రీడా పోటీలు ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 13: దివ్యాంగులు వైకల్యాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆకాంక్షించారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్‌ఎస్)లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయి క్రీడోత్సవాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో దివ్యాంగులు ముందుకెళ్తున్నారన్నారు. దివ్యాంగులను ప్రభుత్వం క్రీడల్లో ప్రోత్సహిస్తుందన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం తమవంతు సహకారం అందిస్తామన్నారు. ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ క్రీడలు మనలోని శక్తి, ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తాయన్నారు. ఈనెల 15న హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మధురిమ తెలిపారు. పరుగు, షాట్ పుట్, జావెలిన్‌త్రో, చెస్, క్యారమ్స్ తదితర క్రీడా పోటీల్లో దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్ అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంతోష్ కుమార్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లు బిల్లా మహేందర్, సురేశ్, ధనుంజయ, మల్లికాంబ, బన్ను మనోవికాస కేంద్రాలు, వెంకటేశ్వర బధిరుల పాఠశాల, స్పందన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మడికొండ : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. కడిపికొండలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం 15వ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ సుభాషిణి, డాక్టర్ బీ హరి, పీడీ శ్రీనివాస్, కవిత, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★మాస్టర్ ఫుట్‌వేర్, మండిబజార్, వరంగల్ నందు పనిచేయుటకు సేల్స్‌మెన్స్ కావలెను. వెంటనే సంప్ర: M. అస్లాం, సెల్: 9700909950
NTW-000

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

**CHANGE OF NAME**

I, **JIBY KANDATHINKARA** (Old Name) S/o **THOMAS KANDATHINKARA JOSEPH** # 16-33, KARUNAPURAM, VIDYANIKETHAN JR COLLEGE, PEDDAPENDIALA, HANAMAKONDA, TS. Hence I changed my name as **JIBY THOMAS** (New Name) S/o **THOMAS KANDATHINKARA** for all my future purposes.

**CHANGE OF NAME**

★ I, the undersigned **HOORUNNISA CISHTY BEGUM** (New Name), Previously called **HOORUNNISA CHISHTI BEGUM** (Old Name), R/o H.No. 20-11-155/1, Middile Fort, Khila Warangal, Warangal Dist-506005, T.S. India and solemnly declare.
NTW-000

**బిజినెస్ ఆఫర్**

★డైలీ సేల్స్ ప్రొడక్ట్స్ బిజినెస్ కోసం 2 లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ చేయగలవారు సంప్రదించండి. వారాకి 14 వేలు ఆదాయం ఉంటుంది./శ్రీ విజయలక్ష్మి వెజ్ నాన్-వెజ్ పచ్చళ్ళు & కిరాణా ప్రొడక్ట్ జనగాం 8143909459
NTW-0000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |
| 9182777213 | 9182777558 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565